www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 14 జూన్ 2024

5

చిత్తూరు



మాకు గౌరవ వేతనం చెల్లించండి..!

ఎన్నికల విధుల నిర్వహణ సిబ్బంది అభ్యర్థన



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న తమకు రావలసిన గౌరవ వేతనం చెల్లించాలని నియోజకవర్గ సెక్టార్లు, రూట్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్‌టీ టీమ్ మెంబర్లు ఎన్నికల అధికారి అయిన తహశీల్దారుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. నగరి తహశీల్దారు కార్యాలయానికి చేరుకున్న వారు తమకు ప్రభుత్వ నిబంధనల మేరకు రావలసిన వేతనం, టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దారు జిల్లా అధికారులతో చర్చించి రూ.10 వేలు చెల్లిస్తామని తెలిపారు. దీనిపై ఎన్నికలకు పని చేసిన సిబ్బంది మాట్లాడుతూ తమకు త్వరగా డబ్బులు చెల్లించి న్యాయం చెయ్యాలన్నారు.

టిటిడి నుండే ప్రక్షాళన మొదలు పెడతా..!

- ఆలయం ముందు రాజకీయ దుర్భాష వ్యాఖ్యలు సహించం
- ఐదేళ్లలో భ్రష్టుపట్టించారు..
- రాష్ట్ర సిఎం చంద్రబాబు నాయుడు



తిరుమలలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుమల:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, ఏపీ మంత్రి లోకేష్, కోడలు బ్రహ్మిణి, మనవడు చి.దేవాన్ష్‌తో కలిసి గురువారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ముఖ్యమంత్రి ఆలయంలోకి ప్రవేశించారు. మహద్వారం వద్దకు చేరుకోగానే జేఈవోలు అర్చకులు కలిసి ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రికి స్వామివారి శేషవస్త్రాన్ని అందించారు. తరువాత రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, డైరీ, క్యాలెండర్, అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తులను జేఈఓ వీరబ్రహ్మం అందించారు. అనంతరం ముఖ్యమంత్రి శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న శ్రీబేడి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని, అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. తర్వాత తిరుమల పెద్ద జీయర్‌స్వామి మఠానికి వెళ్లి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. సిఎం వెంట దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవలవన్, తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, కొత్తగా ఎన్నికైన పార్లమెంటు, శాసన సభ, శాసనమండలి సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో సీఈవో ఎస్వీబీసీ షణ్ముఖ్ కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ 2 జగదీశ్వర్ రెడ్డి, సీవీఆర్వో డాక్టర్ టీ.రవి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టిటిడి నుండే ప్రక్షాళన మొదలు పెడతా..!

టీటీడీ నుంచి ప్రక్షాళన మొదలుపెడతామని సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయాన్ని వెల్లడించారు. తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇక పరదాలు కట్టే కార్యక్రమాన్ని మానుకోవాలని అన్నారు. గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శించుకున్న తర్వాత సీఎం చంద్రబాబు తొలిసారి మీడియాతో మాట్లాడారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు మీడియాతో మాట్లాడడం ఇదే తొలిసారి అని, తమ కులదైవం వేంకటేశ్వరుడు, ఆయన దగ్గరే సంకల్పం చేసి కార్యక్రమం మొదలెడుతానని తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో అంచెలంచెలుగా ఎదిగానని, శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సమయంలో బాంబ్ బ్లాస్ట్ జరిగినా నా కులదైవమే నన్ను కాపాడాడని గుర్తు చేసుకున్నారు. దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏటా తిరుమలలో అన్నదానం చేయించడం అనవాయితీ అని, తిరుమల పవిత్రమైన దివ్యక్షేత్రమని, ఈ క్షేత్రాన్ని అపవిత్రం చేయడం భావ్యం కాదని అన్నారు. తిరుమలలో ఉంటే వైకుంఠంలో ఉన్నట్లు భావన ఉంటుందని అటువంటి తిరుమలను ధనార్జన కేంద్రంగా మార్చారని, విపరీతమైన రేట్లు, బ్లాక్ మార్కెట్‌లో టికెట్ల విక్రయం ఉండకూడదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గ్రీనరీ పెంచామని, గంజాయి, అన్యమత ప్రచారం, మద్యం, మాంసం అంటూ విచ్చలవిడిగా గత ప్రభుత్వం వ్యవహరించిందని అన్నారు. ఇష్టానుసారం తమకు నచ్చిన వారికి పదవులు ఇచ్చారని, పెళ్లిళ్లు పేరంటాలకు స్వామివారిని అమ్మే ప్రయత్నం చేశారని, ఎర్ర చందనం స్మగ్లర్లు సీట్లు ఇచ్చారని ఆరోపించారు. దృఢ సంకల్పంతో చెడును అణచి వేస్తామన్నారు. శ్రీవారి ఆశీస్సులు తీసుకొని పరిపాలన సాగించాడని వచ్చా.. శ్రీవారి సన్నిధిలో రాజకీయం మాట్లాడటం సబబు కాదని, దొంగలే దొంగ దొంగ అంటూ గత ప్రభుత్వంలో వ్యవహరించారని విమర్శించారు. నేరాలు చేసి తప్పించుకోవాలంటే వదిలిపెట్టం.. నేరం వేరే వాళ్లపై వేయడానికి ప్రణాళికలు వేసిన నేరస్తుడికే శిక్ష వేస్తామని అన్నారు.

'టీటీడీ నుంచి ప్రక్షాళన మొదలు పెడతానని, తప్పు చేసిన వారిని శిక్షించాలని, పరదాలు కట్టే కార్యక్రమాన్ని మానుకోవాలని అన్నారు. ప్రజలపై అపారమైన విశ్వాసం, గౌరవం ఉందని, దేశ విదేశాల నుంచి వచ్చి ఓటు వేసి తమ బాధ్యత తెలుగు ప్రజలు తీర్చుకున్నారని, తాను 5 కోట్ల ప్రజా మనిషిని అందరి వాడినని అన్నారు. ఇన్నాళ్లు వాస్తవాలను చెప్పలేని దుస్థితిని మీడియా ఎదుర్కొందని, కేసులు పెట్టి భయపెట్టే పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదని అన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రజాపాలన సాగుతోందని, ప్రజలందరికీ న్యాయం చేస్తామని, 5 సంవత్సరాలు జరిగిన నష్టం, 30 ఏళ్లు రాష్ట్రం వెనక్కువెళ్లిందన్నారు. ప్రజలు ప్రభుత్వంతో భాగస్వామి కావాలని, పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రం బాగుండాలని, అమరావతి, పోలవరం నిర్మాణం చేపట్టాలని తిరుమల వెంకటేశ్వర స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఇది చారిత్రాత్మక విజయం, దేశ చరిత్రలో ఇదే మొదటిదని, భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలని, దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉండాలని అందుకు ఆర్థిక అసమానతను అధిగమించాలని అన్నారు. ఇది ప్రభుత్వ విధానాల వల్ల మాత్రమే సాధ్యం అవుతుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి చేసిన అనంతరం ప్రపంచ దిగ్గజాలు హైదరాబాద్‌కు వచ్చాయని, భారత దేశంలోని కుటుంబవ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమన్నారు. ప్రపంచంలో భారతీయులు అగ్రస్థానంలో ఉండగా అందులో తెలుగు వారు 35 శాతంకు పైగా ఉన్నారని, రెండవ ఆర్థిక రిఫార్మ్స్ తానే తీసుకొచ్చానని, మొబైల్ ఫోన్ ఇప్పుడు నిత్యావసర వస్తువుగా మారిపోయింది. సంపద సృష్టించి.. వచ్చిన సంపద పేదవాడికి ఇచ్చే కార్యక్రమం చేపట్టాలని అన్నారు.



రంగనాయకుల మండపంలో కుటుంబంతో సిఎం చంద్రబాబు


శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి



తిరుపతి సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం నారా చంద్రబాబు నాయుడు దంపతులు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, వేద ఆశీర్వాదం చేశారు. అనంతరం జేఈవో వీరబ్రహ్మం అమ్మవారి ప్రసాదాలు, వస్త్రం అందచేశారు.

చంద్రబాబుకు ఘన వీడ్కోలు

రేణిగుంట: రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు పయనమైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. గురువారం మధ్యాహ్నం 12.22 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న సిఎంకు సాదర వీడ్కోలు లభించింది. రేణిగుంట విమానాశ్రయం వెలుపల ఉన్న ప్రజలను ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. అనంతరం మధ్యాహ్నం 12.36 గంటలకు విజయవాడకు కుటుంబసభ్యులతో కలిసి తిరుగు ప్రయాణమయ్యారు. అనంతపురం రేంజి డీఐజీ షిమోషి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పి హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సివి నాయుడు, సుగుణమ్మ, వరప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.



సిఎం చంద్రబాబుకు ఘన వీడ్కోలు పలికిన కలెక్టర్



క్యాన్సర్ కేర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి

'కాంప్రహెన్సీవ్ క్యాన్సర్ కేర్' ప్రారంభం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి 'కాంప్రహెన్సీవ్ క్యాన్సర్ కేర్' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. స్టేట్ మానిటరింగ్ అధికారి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని వైద్యాధికారులకు, ఎంఎల్‌హెచ్‌పిలకు, ఏఎన్ఎంలకు 30 సంవత్సరాల పై బడిన వారికి వివిధ రకాల క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ పై స్క్రీనింగ్ ఎలా చేయాలి? అనే దానిపై మూడు రోజుల శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ అన్ని జిల్లా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లు, ఏరియా హాస్పిటళ్ల లోనూ నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కి 40 మంది చొప్పున జూలై 10 వ తేదీ వరకు ఈ కార్యక్రమం పూర్తిచేసి, ఇంటింటి స్క్రీనింగ్ సర్వే చేసి మెడికల్ కాలేజ్‌లో ట్రీట్‌మెంటు ఇస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణలో అందరూ అన్ని విషయాలు తెలుసుకుని స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పక్కాగా చేసి త్వరిత గతిన బాధితులను కనుగొని చికిత్స అందిస్తే వారి జీవితాన్ని పొడిగించిన వారు అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్‌సిడి కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, డిపిఓ డాక్టర్ హర్షవర్ధన్, టిఓటిలు డాక్టర్ దేవరాజ్ డెంటిస్ట్, డాక్టర్ మీనా సైయద్, డాక్టర్ మాధవి, స్త్రీల వైద్య నిపుణులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించుకోవాలి

ప్రజాశక్తి- సోమల:

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని, సమాజ హితమే లక్ష్యంగా నడుచుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పర్యావరణానికి హాని కలిగించే వాటిని వాడకుండా సమాజ హితమే లక్ష్యంగా నడుచుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపారు.

పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి: ఎంవిఐ

ప్రజాశక్తి -గంగవరం: ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పని సరిగా ఉంటేనే వాహనాలు నడపాలని అలా లేకుంటే చర్యలు తప్పవని స్థానిక ఎంవిఐ మధుసూదన్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తమ వాహనాలకు అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలని వారికి తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సులు, యూనిఫామ్ ఉండాలని, ప్రతి బస్సుకు సహాయకులు ఉండాలని, వాహనాలకు రికార్డులు ఎఫ్‌సిలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. అలా లేని వాహనాలు ఉన్నాయని తమ దృష్టికి వస్తే తప్పని సరిగా వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా కాన్వెంట్ పాఠశాలలో చిన్న పిల్లలు బస్సులలో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతూ ఉంటారని కొన్ని పాఠశాలలు చిన్న వాహనాలలో ఎక్కువ మంది విద్యార్థులను తరలిస్తుంటారని, అలా కాకుండా ప్రతి పాఠశాల యాజమాన్యం దీన్ని గుర్తించి పరిధికి మించి పిల్లలను వాహనాలు ఎక్కించ కూడదని పేర్కొన్నారు.

విద్యార్థులకు విద్యా కిట్స్ సరఫరాకు శ్రీకారం

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరులోని పాఠశాలల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో భద్రపరిచిన స్టూడెంట్ కిట్స్ పాఠ్య పుస్తకాలు, బూట్లు , నోట్ బుక్స్ బెల్ట్ మొదలైనవి మండలంలో ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని మండల విద్యాశాఖ అధికారులు పి లీలారాణి బాలు సుందరం తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లా డుతూ మండలంలోని మొత్తం 6,950 మందికి పాఠ్యపుస్తకాలు, బూట్లు, బెల్టులు, నోట్ బుక్స్‌లు వచ్చాయని ఇంకా కొన్ని సబ్జెక్టులు రావాలని పేర్కొన్నారు. బ్యాగ్స్, యూనిఫామ్స్ రావాలని తెలిపారు. ఒకటి నుండి 5 వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు మూడు జతల యూనిఫాం క్లాత్ బెల్ట్ 80 శాతంతో కూడినవి అందిస్తారు. ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఇంగ్లీష్ నిఘంటువు ఇవ్వనున్నారు. 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, చున్నితో సహా లార్జ్ సైజు బ్యాగు, బెల్టులు, పాఠ్య పుస్తకాలు మండలంలోని 70 పాఠశాలలకు అందిస్తామని తెలిపారు. గురువారం పాఠశాలలు పు:న ప్రారంభం అయ్యాయి. పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ ఇచ్చి మెటీరియల్స్‌ను చక్కగా వినియోగించుకుంటూ బాగా చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని 2024 -25 నూతన విద్యాసంవత్సరానికి స్వాగతం పలుకుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం ఎంఈఓలు బాలుర పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బూట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ షంషీర్, స్టాఫ్ సిఆర్ఎంటిలు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్స్ , ఐఆర్‌పిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు హాజరయ్యారు.



విద్యార్థులకు విద్యా కిట్స్ అందిస్తున్న ఉపాధ్యాయులు



టీకాలు కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి దేవి

బిసిజి టీకాతో క్షయకు చెక్

డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఓ ప్రభావతి దేవి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

బిసిజి టీకాతో క్షయకు చెక్ పెట్టవచ్చని డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు ఓ ప్రభావతి దేవి పేర్కొన్నారు. చిత్తూరు నగర పరిధిలోని మా పాక్షి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని అనుపల్లిలో బీసీజి వ్యాక్సినేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ(టిబి) వ్యాధి లేని భారతదేశం లక్ష్య సాధన కోసమే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని డిఎంఅండ హెచ్‌వో పేర్కొన్నారు. భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టిబి మరణాల తీవ్రతను నివారించడంలో బీసీజీ టీకా చాలా సురక్షితమైందని, క్షయకు వ్యతిరేకంగా రోగ నిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దలలో టిబి నుండి రక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజన కారి అని పేర్కొన్నారు. ఎవరూ ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా వేసుకోవచ్చునని, 60 సంవత్సరాలు పై బడ్డ వారు, పొగ పీల్చేవారు, మధుమేహ వ్యాధి గ్రస్తులు(18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు), టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులు టీకాకు అర్హులని తెలిపారు. అర్హత ఉన్న వారికి మాత్రమే ఈ టీకాను వేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త, ఆశ కార్యకర్త , ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హైస్కూలును తనిఖీ చేసిన డిఇఓ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి హై స్కూలును గురువారం డీఈఓ దేవరాజు తనిఖీ చేశారు. ప్రభుత్వ పరంగా సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థిని విద్యార్థులకు డీఈఓ పంపిణీ చేశారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు మధ్యా హ్నం భోజన పథకాన్ని తనిఖీ చేసి ఆయన భోంచేశారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నెల్లేపల్లి హై స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మండలానికి మొదటి స్థానంలో రాణించడంపై హెచ్ ఎం , టీచర్ల ను ఆయన అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఎంఈఓ కాణిపాకంఆంజనేయులు శెట్టి, హెచ్ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌ఛార్జి హెచ్ఎం యుగంధర్ ఆచారి, పలువురు టీచర్లు పాల్గొన్నారు.





శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్న టిడిపి శ్రేణులు

శిలాఫలకాలు ధ్వంసం

ప్రజాశక్తి -పుంగనూరు:

వైసిపి అధికారంలో ఉన్నప్పుడు సచి వాలయాలు వద్ద ఏర్పాటు చేసిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి ఫొటోలు ఉన్న శిలా ఫలకాలను టిడిపి శ్రేణులు ధ్వంసం చేశాయి. పుంగనూరు మండలంలో నాలుగవ నెంబరు సచివాలయం, నాలుగవ నెంబరు రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం గడ్డపార్లతో శిలాఫలకాలను తొలగించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ దాడులు చేపట్టారు. మండలంలోని బోడేవారి పల్లి, భీమ గాని పల్లి, పాలెంపల్లి, మోదుగులపల్లి పంచాయతీలలోని సచివాలయ కార్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన వైసీపీ శిలాఫలకాలు ధ్వంసం చేశారు. దీనిపై ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మాజీ ముడా ఛైర్మన్ ఎన్ వెంకట్ రెడ్డి యాదవ్, ఏఎంసి ఛైర్మన్ అమరనాథ్ రెడ్డి, గోల్కొండ అభివృద్ధి మండలి మాజీ ఛైర్మన్ నాగరాజు రెడ్డి, సర్పంచులు కలసి ఈ సంఘటనపై ఎంపిడిఓ మునిరెడ్డి కి ఫిర్యాదు చేశారు.

శాంతినికేతన్ స్కూలుపై చర్యలు తీసుకోవాలి

ఎంఈవోకు ఫిర్యాదు

ప్రజాశక్తి - రామకుప్పం:

మండల కేంద్రం సమీపం లో నిర్వహిస్తున్న శాంతినికేతన్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ఎంఈఓ నారాయణకు గురువారం ఫిర్యాదు చేశారు. స్కూల్ నిర్వహణలో ఐదవ తరగతి వరకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని, 6 తరగతి నుంచి10వ తరగతి వరకు చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేక అనుభవం లేని ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యను అందించలేక పోతున్నారని ఆ ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. 16 సెంట్లు భూమిలో మాత్రమే పాఠశాల భవనం నిర్మించుకొని పిల్లలకు ఎటువంటి భద్రత లేకుండా పాఠశాల నిర్వహణ చేస్తున్నారన్నారు. ఇలాంటి పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకొని విద్యార్థిని ,విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కేశవరెడ్డి, నవీన్ ఉన్నారు.

ఎంపీని కలిసిన ఎంపీపీ భర్త


ఎంపీ గురుమూర్తిని సన్మానిస్తున్న బండి హేమసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తిని వెదురు కుప్పం మండలం ఎంపిపి భర్త, రాష్ట్ర వైసిపి సంయుక్త కార్యదర్శి బండి హేమ సుందర్ రెడ్డి గురువారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తిని ఘనం గా సన్మానించారు. ఈ క్రమంలో కొంత సేపు జరిగిన ఎన్నికల పరిస్థితి పై చర్చించారు. వైసిపిలో ఉన్న ప్రతి నాయకుడు ధైర్యంగా ఉండి ముందుకు రాజకీయంగా నడవాలని బండి హేమ సుందర్ రెడ్డికి ఎంపీ గురుమూర్తి భరోసా ఇచ్చారని తెలిపారు.


సంబరాలు నిర్వహిస్తున్న వెదురుకుప్పం మండల టిడిపి నాయకులు

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా, ఎమ్మెల్యే గా డాక్టర్ వీఎం థామస్ గెలిచిన సందర్భంగా భారతం మిట్ట సర్కిల్‌లో టిడిపి అభిమానులు, మహిళ లు గురువారం టపాసులు కాల్చి సంబరాలు చేసు కున్నారు. ఈ కార్యక్ర మాన్ని ముఖ్య అతిధి గా విచ్చేసిన వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జి, జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి మోహన్ మురళి కేక్ కట్ చేసి ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ కి వెదురు కుప్పం పంచాయతీలో 512 ఓట్లు మెజార్టీ వచ్చినందుకు మహిళలు, కార్యకర్తలకు మోహన మురళి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోలార్ చిన్నప్ప, కోదండ రెడ్డి, మోహన్ రెడ్డి చంద్రశేఖర్, దాసు టైలర్, సుబ్బరాయులు, ఉదయ్‌చంద, ఓం కిరణ్, మహిళలు సుజాత, చిట్టెమ్మ, కోటేశ్వరి, కుమారి, రోజా, శ్రావణి, చాందిని, నాగభూషణ, మణిమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.


విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిటిసి రాధాకృష్ణన్

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని గుండిగల్లు ఉన్నత పాఠశాలలో గురువారం గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్వాహకులు, అవార్డు గ్రహీత, సమాజ సేవకులు, మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా 150 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. గతంలోనూ అనేకసార్లు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆయన స్వంతంగా నిర్వహిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రతి పౌర్ణమికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానంతో పాటూ సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు స్వీట్లు పంచామని తెలిపారు. ఈ సందర్భంగా పరువులు మాట్లాడుతూ రాధాకృష్ణ భవిష్యత్తులో మరిన్ని పుట్టిన రోజులు చేసుకుంటూ సమాజానికి సేవ చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు జయంత్ కుమార్, వేణుగోపాల్, మనీ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాజీ సర్పంచ్ దొరస్వామి రాజుకు నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నేతలు

దొరస్వామి రాజుకు పలువురి నివాళి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని బాలగంగానపల్లి వింజం పంచాయతీల ఉమ్మడి మాజీ సర్పంచ్ దొరస్వామి రాజు బుధవారం మర ణించిన విషయం తెలిసిం దే విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నేతలు అధికారులు పలువురు బాలగంగానపల్లి గ్రామంలో గురువారం దొరస్వామిరాజు పార్థివ దేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, వెంకటేష్, దేవ సుందరం, స్వామి దాస్, రాంబాబు రెడ్డి, కోదండ రెడ్డి , నియాజ్ అలి, జీవరత్నం, జ్యోతి యాదవ్, అశోక్ నాయుడు, శాంత కుమార్, సంపత్, తులసిరెడ్డి, వైసీపీకి చెందిన వేల్కూరు బాబురెడ్డి, గుణశేఖర్ రెడ్డి, బిజెపి చెందిన సుధాకర్, పలువురు సచివాలయ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న ఏపీ ఎన్‌జీవో నాయకులు

ఎమ్మెల్యేకు ఏపీ ఎన్జీవో నాయకుల అభినందనలు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన గురజాల జగన్మోహన్‌ను స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని నివాసంలో గురువారం ఏపీ ఎన్జీవో నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాలను ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు రాఘవులు, కార్యదర్శి రఘు లతోపాటు ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నిరుద్యోగులకు సువర్ణావకాశం

మండల టిడిపి యూత్ అధ్యక్షులు రాజేష్

ప్రజాశక్తి -భైరెడ్డిపల్లి : డిఎస్‌సి విడుదల నిరుద్యోగులకు సువర్ణావకాశమని మండల టిడిపి యూత్ మండల అధ్యక్షులు రాజేష్ పేర్కొన్నారు. నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మెగా డీఎస్సీ పై మొదటి సంతకం చేయడమే కాకుండా పెన్షన్ పెంపు, డిఎస్‌సి ద్వారా 16,347 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలుపగా తమకు చాలా సంతోషంగా వుందని మండలంలోని యువకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ పున: ప్రారంభించడమే టిడిపి లక్ష్యమని మండల ప్రజలు టిడిపికి సహకరించి ముందుకు నడిపించాలని మండల అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి రాధకిషోర్ గౌడ మాజీ అధ్యక్షులు జై కుమార్, మాజీ ఎంపీపీ కృష్ణవేణి జయకుమార్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మండల టిడిపి యూత్ అధ్యక్షులు రాజేష్ పేర్కొన్నారు.

ఆరు నెలలు కమ్యూనిటీ సర్వీస్ చేయాలి

ప్రమాద కేసులో జడ్జి తీర్పు



ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: యాక్సిడెంట్ కేసులో నేరం నిరూపణ కావడంతో నిందితుడు ఆరు నెలల పాటూ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కమ్యూనిటీ సర్వీసు చేయాలని జడ్జి విష్ణువర్మ తీర్పు ఇచ్చారు. 2022వ సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటనలో వెంకటరమణ అనే వ్యక్తిపై నగరి పోలీసు స్టేషన్‌లో యాక్సిడెంట్ కేసు నమోదైంది. ఈ కేసు విచారణ నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం ముగింపు దశకు వచ్చింది. నేరం నిరూపణ కావడంతో నిందితుడికి శిక్షపడింది. మృతుని కుటుంబానికి రూ. పదివేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఆరు నెలల పాటు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని జడ్జి విష్ణువర్మ శిక్ష విధించారు. కాగా ఇలాంటి తీర్పు వెలువరించడం ఇదే మొదటిసారి అని కోర్టు సిబ్బంది తెలిపారు. కేసు వాదనలో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపి ఎం.రామ శాంతి, సీఐ సురేష్, కోర్టు కానిస్టేబుల్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు సంక్షేమ నిధులు మంజూరు చేయాలి

- టిడిపి జిల్లా గౌడ్ సాధికార సమితి అధ్యక్షులు బుస్సా నాగరాజు గౌడ్

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: కల్లుగీత కార్మికులకు సంక్షేమ నిధులు మంజూరు చేయాలని టిడిపి జిల్లా గౌడ సాధికార సమితి అధ్యక్షులు బుస నాగరాజు గౌడ్, రాష్ట్ర గౌడ్ సాధికార సమితి అధ్యక్షులు రేఖ సుధాకర్ గౌడ మంగళగిరిలో గురువారం టిడిపి నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవం ముగిసిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు నాడు గీత కార్మిక సంఘం అధ్యక్షులు మంగళగిరి కార్యాలయంలో టిడిపి నాయకులను మర్యాద పూర్వకంగా కలిసి గీత కార్మికులకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రావాల్సిన ప్రభుత్వ పథకాలు గురించి, మద్యం షాపులో గీత కార్మికులకు రాయితీతో మద్యం షాపులు కేటాయించాలని దీనిపై ప్రభుత్వ పెద్దలతో చర్చించి గౌడ కల్లు గీత కార్మికులకు తగు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో చిత్తూరు పార్లమెంటు టిడిపి ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుసా నాగ రాజ గౌడ, కొత్తపల్లి రెడ్డప్ప గౌడ, లేబాకుల మురళి గౌడ, యస్ నారాయణ స్వామి, భుజగేంద్ర పాల్గొన్నారు.


మంగళగిరిలో టిడిపి నాయకులను కలిసిన కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు: ఎంవిఐ



ప్రజాశక్తి-పలమనేరు: విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదని, ఫిట్‌నెస్ లేని వాహనాలు గత నెల నుండి ఇప్పటి వరకు 256 బస్సులను ఎఫ్‌సి చేశామని, స్కూల్ బస్సుల విషయంలో ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఎంవిఐ మధుసూదన్ పేర్కొన్నారు. పలమనేరు పట్టణం ఆర్టీవో కార్యాలయం లో ఎంవిఐ మధుసూదన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ స్కూల్స్ తెరుచుకున్న సందర్భంగా, స్కూల్ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి భయాందోళనలు చెందవలసిన అవసరం లేదన్నారు. ప్రతి ఒక్క స్కూల్ బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలను సంబంధించిన యజమానులకు అందజేస్తామని, ఇందులో ఎలాంటి భయాలు అవసరం లేదన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లకు ఐదు సంవత్సరాలు హెవీ మోటార్ లైసెన్సు కలిగి ఉండాలని, 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. మే 15 నుండి నేటి వరకు 266 బస్సులకు ఎఫ్‌సి చేశామన్నారు. స్కూలు బస్సుల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఏదైనా అనుమానం ఉన్నా, సమస్యలు వున్నా నేరుగా తనకు ఫిర్యాదు చేయాలన్నారు.


ఎస్వీయూలో నిరుద్యోగుల సంబరాలు



ప్రజాశక్తి-క్యాంపస్: ఏపీ సీఎంగా ప్రమాణస్వీకారం చేపట్టిన చంద్రబాబు గురువారం మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీయూలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. 16,347 పోస్టులతో డీఎస్సీ ప్రకటించడం సంతోషదాయకమని వారు తెలిపారు. అలేగా అన్న క్యాంటీన్, రైతుల పాలిట శాపంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్ రూ. 4వేలకు పెంపు వంటి నిర్ణయాలు శుభపరిణామాలుగా అభివర్ణించారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్కే నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ పాకనాటి హరికృష్ణయాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిశోధకులు రమేష్, చిట్టిబాబు వెంకటేశ్వర్లు నాయుడు, విద్యార్థులు భీష్మన్న, శ్రీరామ్, సోమేష్, బషీర్, రామంజి, రమేష్, రఘు, పెద్దయ్య, లక్ష్మన్న, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

'మా అన్నను కాపాడండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వద్ద మే14వ తేదీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానిపై జరిగిన దాడి కేసులో తన అన్న అప్పన్నగిరి సుధాకర్ రెడ్డిని తిరుమలలో హనుమాన్ మాల ధారణలో ఉండి భోజనం చేస్తున్న వ్యక్తిని కుట్రపూరితంగా అన్యాయంగా ఈ కేసులో ఇరికించి జైలు పాలు చేశారని, తన అన్నను కాపాడాలని సీఎం చంద్రబాబుకు హరిత వినతి పత్రాన్ని అందజేశారు. తిరుమల పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబుకు రేణిగుంట విమానాశ్రయంలో ఈ మేరకు ఆధారాలతో సహా హరిత చంద్రబాబుకు వివరించి మొరపెట్టుకున్నారు. హరిత ఇచ్చిన వినతి పత్రాన్ని తీసుకొన్న చంద్రబాబు జిల్లా కలెక్టర్‌కు అందించారు.


సిఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని ఇస్తున్న హరిత

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-నాయుడుపేట: టీడీపీ నెల్లూరు పార్లమెంటు మహిళా అధ్యక్షులు పనబాక భూలక్ష్మీ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసపురంలో ఈ నెల 5న తిరుమలశెట్టి అంకయ్య కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సేవా సమితి సభ్యులు పనబాక గంగబాబు సేవా సమితి నిధులతో అంకయ్య అంత్యక్రియలు చేపట్టారు. అలాగే గురువారం అంకయ్య ఉత్తరక్రియలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పనబాక గంగాబాబు మాట్లాడుతూ శ్రీనివాసపురంలోని గిరిజనులు కలుషిత తాగునీటిని తాగడం వల్ల కిడ్నీ వ్యాధి ప్రబలి వేటగిరి చెంచమ్మ, వేటగిరి పోలమ్మ, బూదూరు రమాదేవి, సత్తెటి రామయ్య మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కలుషిత తాగునీటి కారణంగా తుపాకుల చిన్నయ్య పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నాడని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆ గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించి గిరిజనుల ప్రాణాలను కాపాడాలని కోరారు.



కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన


ప్రజాశక్తి-గూడూరు టౌన్: పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. వైద్యులు సూచించిన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధి సీతారామనాయుడు చెప్పారు. పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ సహకారంతో పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు చేయించాల్సిన వారిని గుర్తించారు. అదేవిధంగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

క్రైం న్యూస్

కోర్టులో కేసువున్నా, ఇంటి స్థలం కబ్జా

- దాడితో భార్య భర్తలకు గాయాలు, పరిస్థితి విషమం



గాయపడి చికిత్స పొందుతున్న దంపతులు

ప్రజాశక్తి -పుంగనూరు: ఓ ఇంటి స్థలానికి సంబంధిం చి కోర్టులో కేసు నడుస్తున్నా దౌర్జన్యంగా ఇంటి స్థలాన్ని ఆక్రమించు కుని పునాది తీస్తుండగా భార్యా భర్తలు కలిసి స్థలాన్ని అడ్డుకుని దాడి చేయడంతో భార్యా భర్తల పరిస్థితి విషమంగా ఉండడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. కబ్జాదారులు భార్య భర్తలపై దాడి చేసి వా రిద్దరిని గాయ పరచడంతో వారి పరిస్థితి విషమంగా మారింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వనముల దిన్నె గ్రామానికి చెందిన భార్య భర్తలైన శ్రీరాములు(45), అరుణ(40) ఇంటి స్థలానికి సంబంధించి పది సంవత్సరాలుగా కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. అదే గ్రామానికి చెందిన గణేష్, నారాయణ బుధవారం వివాదాస్పద స్థలంలో పునాది వేసేందుకు వెళ్లారు. స్థలంలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న భార్య, భర్తలు ఇద్దరూ కలిసి అక్కడికి వెళ్లి పునాది వేయకూడదని, నిలిపివేయాలని హెచ్చరించారు. వారు ఇదేమి వినకుండా పునాదులు వేస్తుండగా స్థలంలోకి వెళ్లి అడ్డుగా నిలబడ్డారు. దీంతో గణేష్, నారాయణ ఇద్దరూ వారిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. వారిని వెంటనే పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా తలపై బలమైన గాయం తగలడంతో 15 కుట్లు వేసి మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాను బోల్తా

- ఇద్దరికీ తీవ్ర గాయాలు - నలుగురికి స్వల్ప గాయాలు



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ బంగ్లా సమీపంలోని చెన్నపట్నం చెరువు మలుపు వద్ద గురువారం ఉదయం పుంగనూరు నుండి సోమల వైపు వస్తున్న బొలెరో లగేజీ వ్యాను బోల్తా పడడంతో ఇద్దరు తీవ్రంగా, నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వాహనం లోని కర్ణాటక నంగిలి గ్రామానికి చెందిన కేశవ, సుబ్బయ్యకు తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని ప్రైవేటు వాహనంలో సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరికి చేతులు, మోచేయి వద్ద విరగడంతో కేశవ, సుబ్బయ్యలను పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ


చంద్రబాబుతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావు కలిసి గురువా రం శ్రీ వెంకటేశ్వర స్వా మిని దర్శించు కున్నా రు. అంతకు ముందు ముఖ్యమంత్రితో కలిసి తిరుమలకు చేరుకున్న ప్రసాద్ రావుకి టిటిడి అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం ఆయన విఐపి విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుమల ఆలయంలోని రంగనాయకుల మండపంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి వేద ఆశీర్వచనం అందుకున్నారు. తర్వాత తిరుమలలో చంద్రబాబు నిర్వహించిన విలేకరుల సమావేశం లో దగ్గుమళ్ళ ప్రసాద్ రావు పాల్గొన్నారు.


బిసిజి టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది..

210 మందికి బిసిజి టీకాలు పంపిణీ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సబ్ సెంటర్లలో 210 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు వైద్యాధికారి జయసింహ తెలిపారు. సోమల 36, దిడ్డివారిపల్లి 34, ఇరికిపెంట 40, నంజంపేట 30, పొదలకుంటపల్లి 20, 81 చిన్న ఉప్పరపల్లి 50 మందికి వ్యాక్సిన్ వేసినట్టు వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమరనాథ్, సూపరువైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల బెడదకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని తక్షణమే నివారణకు చర్యలు తీసుకోవాలని జనసేన నేత నాగార్జున అధికారులను కోరారు. గురువారం ఆయన మాట్లా డుతూ జెండా మాన్ వీధి ఎక్స్‌టెన్షన్ నందు కుక్కల బెడద ఎక్కువగా ఉంద న్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతంలోనే పాఠశాలలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు రాకపోకల సమయంలో కుక్కలు దాడి చేసే అవకాశం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను కోరారు.


వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు